ఓం శాంతి

## నిమిత్త టీచర్లు మరియు సర్వ బ్రాహ్మణ కుల భూషణ సోదరీ సోదరులకు మధుర స్మృతిపత్రము (13-05-16)

ప్రాణప్రియులైన అవ్యక్త బాప్‌దాదాకు అతి అల్లారు ముద్దు పిల్లలు, తమ సూక్ష్మ పవిత్ర కిరణాల సకాష్ ద్వారా ప్రకృతి సహితంగా సర్వులనూ పావనంగా తయారుచేసే సేవలో ఉపస్థితులైయున్న నిమిత్త టీచరు అక్కయ్యలు మరియు దేశ విదేశములలోని బ్రాహ్మణ కుల భూషణ సోదరీ సోదరులందరూ ఈశ్వరీయ స్నేహ సంపన్న మధుర స్మృతులు ఈ రోజు అహ్మదాబాద్ లోటస్ హౌస్ నుండి స్వీకరించండి.

తరువాత సమాచారమేమనగా – డ్రామాలోని ప్రతి దృశ్యమూ అతి ప్రియమైనది మరియు అతీతమైనది. బాబా ఎక్కడ కూర్చోబెడ్తే అక్కడ సేవ ఉంటుంది. బిడ్డా, నీ అడుగు-అడుగులో పదమాలు ఉన్నాయి అని బాబా అన్నారు, మరి నేను ఇక్కడ కూర్చుని అలానే అనుభవము చేస్తున్నాను. మనసా వృత్తి ద్వారా కూడా సేవ, దృష్టి ద్వారా కూడా సేవ. ఇక్కడ కూర్చుని కూడా బాప్‌దాదా మరియు మీ అందరి స్నేహభరిత ఆశీర్వాదాలను అనుభవము చేస్తూ చాలా విశ్రాంతిలో ఉన్నాను. ఆరోగ్యం బాగవుతూ ఉంది, కొంత కాలము తరువాత శాంతివనమునకు వస్తాను.

సంగమయుగములో పరస్పరములో ఒకరినొకరు చూసుకోవటము మరియు ప్రసన్నంగా ఉండటము, ఇది కూడా ఎంత పెద్ద భాగ్యము! మధురమైన బాబా దేనినైతే మాట్లాడటము నేర్పించారో అవి తప్ప మరేవీ మాట్లాడటము రానే రాదు. చిన్న పిల్లలకు మాట్లాడటము నేర్పించటం జరుగుతుంది, అలా బాబా మాకు కూడా ఏం మాట్లాడాలి, ఎలా మట్లాడాలి, ఏం వినాలి, ఎలా వినాలి అన్న వాటినన్నింటినీ నేర్పించారు. ఒక చెవితో విని మరొక చెవి నుండి వదిలివేయటం కాదు. బాబా మహావాక్యాలు ఏవైతే వింటామో, వాటిని జీవితములో ఆచరించాలని మనసు కోరుకుంటుంది. బాబా మన నుండి ఏం కోరుకుంటారు? ఇప్పుడు మొత్తము ఆధారమంతా మన ఆలోచనలపైనే ఉంది. ఈ మాట మాట్లాడదగినదేనా అని ముందుగా దానిని గురించి ఆలోచించండి, తరువాత మాట్లాడండి అని బాబా అంటారు. సంగమయుగ మహిమ చాలా ఎక్కువ. ఇది కొద్ది సమయము మాత్రమే, 5000 సంవత్సరాలలో 100 సంవత్సరాలు అంటే ఏమీ లెక్కలేనట్లు, కనుక మొత్తము చక్రములో ఈ సమయము చాలా విలువైనది. మీ భవిష్యత్తు కొరకు ఇక్కడే సంపాదన చేసుకోవాలి. ఇప్పుడు సంపాదన చేసుకునే, సదా సంతోషములో ఉండే సమయము. మన ద్వారా ఏ పొరపాట్లు జరిగినా వాటిని గతం గతః చేసే శక్తిని బాబా ఇస్తున్నారు. బాబా మనల్ని ఏ విధంగా క్షమిస్తారో అలా మనము కూడా ఇతరులను క్షమిస్తామా! వీరైతే ఎప్పుడూ ఇలానే చేస్తుంటారు అని అనరాదు. అరే, కాస్త జాగ్రత్తగా మాట్లాడండి. పురుషార్థములో సత్యత చాలా సహాయం అందిస్తుంది. శరీరమైతే అనేకసార్లు చాలా ఆటలు చూపించి ఉండవచ్చు, కానీ ఎవరి పిల్లలు, ఏం చేస్తున్నారు....... అని సదా ఈ స్మృతిలోనే ఉన్నాను. సత్యతను చూసి భగవంతుడు, ఈశ్వరుడు సంతోషిస్తారు. సత్యత యొక్క లోతులలోకి వెళ్ళినట్లయితే పురుషార్థము ఏదో చేసామంటే చేసాము అన్నట్లుగా ఉండదు. 40 సంవత్సరాలు విదేశ సేవ చేసే భాగ్యము ఏదైతే లభించిందో, అన్ని చోట్లకూ వెళ్ళి వచ్చాను. మంచిగా అనిపిస్తుంది, ఎక్కడ ఉన్నాగానీ మనమందరమూ ఒక్కటే అని అనిపిస్తుంది, ఒక్కరికి చెందినవారమే. ఏది జరిగిందో అది మంచికే జరిగింది, సమాప్తం. ఇప్పుడు ఏదైతే జరుగుతుందో అది కూడా మంచిగానే ఉంటుంది, గ్యారంటీ.

సాయం సంధ్యాకాలములో చేసే ఈ యోగము మొత్తము విశ్వములో వ్యాపిస్తుంది. మధువనములో తయారుచేసిన పద్ధతిని అందరూ అనుసరిస్తారు. అన్నిచోట్లా ఈ సాయంకాల యోగము జరుగుతూ ఉందని నేను భావిస్తున్నాను. సెంటరులో సంగఠిత రూపంలో కూర్చుని యోగము చెయ్యటమనేది చాలా ముఖ్యము. మీరు ఎక్కడ కూర్చుంటే అక్కడ లైటే లైట్, మైటే మైట్ అని బాబా అనేవారు. బాబా లైట్-మైట్ ఉన్నట్లయితే ఏది జరుగుతుందో అది అంతా మంచిగానే జరుగుతుంది. ఎటువంటి తప్పులూ ఉండవు ఎందుకంటే మనము మొత్తము విశ్వములో అందరికంటే శ్రేష్ఠ ఆత్మలము, మనకు సంగమయుగములో డైరెక్ట్ భగవంతుని పాలన, చదువు మరియు ఖజానాలు లభించాయి, కనుక కేవలము భాగ్యవంతులు కారు, పదమాపదమ భాగ్యశాలురు. చూడండి, నిన్న మన జగదీష్ భాయి స్మృతి దివసము. (మే 12వ తారీఖున వారు బాప్‌దాదా ఒడిలోకి వెళ్ళారు) వారిని అందరూ గుర్తు చేసుకున్నారు. వారు బాబాకు ఎంతటి అపూర్వమైన సంతానము, వారిని మేము దగ్గర నుండి చూసాము, నిజంగా వారు పూర్తి ఆజ్ఞాకారిగా ఉండేవారు. ఇటువంటి బాబా పిల్లలు, మన పూర్వజులైన దీదీ, దాదీ, మమ్మా, భావూ విశ్వకిశోర్, దాదా విశ్వరతన్ అందరూ ఈరోజు ఎదురుగా వస్తున్నారు. అందరూ తమ స్మృతిచిహ్నాలను తయారుచేసుకుని వెళ్ళారు. అచ్ఛా!

చాలా చాలా స్నేహపూర్వకమైన హృదయభరిత స్మృతులతో

ఈశ్వరీయ సేవలో

బి.కె. జానకి దాది.

# అవ్యక్త ప్రేరణలు

## "ఫ్లాలెస్ డైమండ్ (మచ్చ లేని వజ్రము)గా అవ్వండి"

1. బాప్‌దాదా తమ పిల్లలు ప్రతి ఒక్కరినీ ఫ్లాలెస్(మచ్చ లేనివారు)గా తయారుచెయ్యాలనుకుంటారు. ఇందుకొరకు చెయ్యవలసినది ఏమిటంటే కేవలము సాకార రూపములో ఏదైతే చేసి చూపించారో దానిని అనుసరించండి, అప్పుడిక ఏ విషయములోనూ ఫెయిల్ అవ్వరు. ఎక్కడైనా ఫెయిల్ అయ్యే విషయము ఎదురుగా వచ్చినట్లయితే నేను ఫాలో ఫాదర్ చేస్తున్నానా అన్నదానిని గుర్తు చేసుకోవాలి. ఫాలో ఫాదర్ చేసినట్లయితే ఏదైనా అటువంటి కార్యము ఉన్నా, దానిని చెయ్యటంలో బ్రేక్ వస్తుంది, అప్పుడు ఈ కార్యమును మేము చెయ్యవచ్చునా లేదా అని నిర్ణయించుకుంటారు. ఫాలో ఫాదర్ గుర్తు రావటం ద్వారా ఫెయిల్ అవ్వరు, ఫ్లాలెస్‌గా అవుతారు.

2. ఈ రోజుల్లో ప్రతి 3 నెలలకు పరీక్ష ఉంటుంది, అందులో ఫెయిల్, పాస్ అయినవారందరి నంబర్‌ను ఫైనల్‌లో కలుపుతారు. ఎవరైతే మళ్ళీ-మళ్ళీ ఫెయిల్ అవుతారో వారు ఫైనల్‌లో ఫెయిల్ అవుతారు, పిల్లలైన మీకు కూడా ఏదో ఒక రూపంలో మధ్యమధ్యలో పరీక్షలు వస్తూనే ఉంటాయి, ప్రతి పరీక్షలో పాస్ అయి చూపించినట్లయితే అప్పుడు ఫైనల్ పరీక్షలో ఫ్లాలెస్‌గా అయిపోతారు. ఫ్లాలెస్‌గా అయినప్పుడే ఫుల్ పాస్ అని అంటారు. ఏ రకమైన ఫ్లా(మచ్చ) ఉన్నా పాస్ అవ్వరు.

3. బాబా ఏ విధంగా అన్ని విషయాలలో ఫుల్‌గా ఉన్నారో, అలా పిల్లలు కూడా మాస్టర్ నాలెడ్జ్‌ఫుల్‌గా అవ్వాలి. కేవలము నాలెడ్జ్‌లోనే కాకుండా అన్ని విషయాలలో మాస్టర్. మాస్టర్ నాలెడ్జ్‌ఫుల్, మాస్టర్ సర్వశక్తివంతులు అనగా ఏరకమైన ఫీలింగ్‌ల నుండైనా సరే దూరము, అన్ని విషయాలలో ఫుల్. ప్రతి మాటకూ వెనుక ఫుల్ వస్తుంది. కనుక ఎంతగా ఫుల్‌గా అవుతూ ఉంటారో అంతగానే ఫీలింగ్ అనే ఫ్లా(మచ్చ) లేక ఫ్లూ అంతమైపోతుంది. ఫ్లాలెస్(మచ్చలేనివారు) గా ఉన్నవారిని ఫుల్ అని అంటారు.

4. బ్రాహ్మణ జీవితము ఫ్లాలెస్(మచ్చలేని), యోగ్యమైన మరియు ప్రసిద్ధమైన జీవితము. బ్రాహ్మణ ఆత్మలను అందరూ ఉన్నతమైన దృష్టితో చూస్తారు. బాబా కూడా పిల్లల విశేషతలనే చూస్తారు, ఒకవేళ లోపాలను చూసినట్లయితే సదాకాలము కొరకు ఆ లోపమునకు అండర్‌లైన్ అయిపోతుంది. బాబా భాగ్యవిధాత కనుక బాబా ఎల్లప్పుడూ శ్రేష్ఠమైన దృష్టితోనే చూస్తారు. శ్రేష్ఠత ముందు లోపము దానికదే మనసు తింటుంది. శ్రేష్ఠ విషయాలను వినటం ద్వారా లోపాలు స్పష్టమవ్వనే అవుతాయి కనుక బాబా ఎల్లప్పుడూ శ్రేష్ఠతను వర్ణిస్తారు, దీనివలన లోపాలు స్వతహాగానే కనిపిస్తాయి మరియు వాటిని సమాప్తము చేసుకోగలరు.

5. ఎప్పుడైతే నీది అన్నదానిలో నాది అన్నదానిని కలిపేస్తారో అప్పుడు డైమండ్‌లో మచ్చ వచ్చేస్తుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ మచ్చ లేని వజ్రంగా అవ్వాలి. సంకల్పాలు, మాటలు, సంస్కార-స్వభావాలలో ఏ బలహీనతనైనా వర్ణించటము అనగా డైమండ్‌లో మచ్చ పెట్టడము. నా ఆలోచన ఈ విధంగా చెప్తుంది, నా సంస్కారమే ఇటువంటిది లాంటివి చెప్పినట్లయితే అదే మచ్చ. బాబా సంస్కారము, సంకల్పాలు ఏవో, అవే నా సంస్కారాలు, సంకల్పాలుగా ఉండాలి, అప్పుడే సమర్థమైన వజ్రము లేక మచ్చలేని వజ్రము అని అంటారు.

6. ఒకటేమో ఫరియాద్(ఫిర్యాదు) రూపము, మరొకటి యాద్(స్మృతి) రూపము, ఫిర్యాదుల రూపంలోకి వచ్చినట్లయితే ఫస్ట్ స్టేజ్ నుండి సెకండ్‌లోకి వచ్చేస్తారు కనుక సదా మచ్చ లేని సత్యమైన వజ్రము, మెరుస్తున్న వజ్రము, అమూల్య వజ్రముగా అవ్వండి. ఇందుకొరకు పరదర్శన మరియు పరచింతన - ఈ రెండు విషయాల నుండి సదా దూరంగా ఉన్నట్లయితే వజ్రముపై మట్టి మరియు మచ్చలు పడజాలవు.

7. బాప్‌దాదాకు పిల్లలపై విశేష స్నేహము ఉంది కనుక పిల్లలు ప్రతి ఒక్కరూ బాబా సమానంగా సంపన్నమైపోవాలని, సమయముకంటే ముందే నంబర్‌వన్ వజ్రముగా అయిపోవాలి అని కోరుకుంటారు. ఇప్పుడు రిజల్టు విడుదల అవ్వలేదు. ఎవరు తయారవ్వాలనుకుంటారో, ఏ నంబర్‌లో రావాలనుకుంటారో అలా ఇప్పుడు వచ్చేందుకు మార్జిన్ ఉంది కనుక ఎగిరే కళ పురుషార్థము చెయ్యండి. మచ్చలేని నంబర్‌వన్ మెరుస్తున్న వజ్రముగా అవ్వండి. బాప్‌దాదా సత్యమైన, మచ్చలేని, అమూల్య వజ్రాలతో హారమును తయారుచెయ్యాలనుకుంటారు.

8. ప్రతి ఒక్క వజ్రమూ అమూల్యమైనదిగా మెరుస్తూ ఉండాలి, దాని లైట్-మైట్‌ల మెరుపు హద్దు వరకే కాకుండా బేహద్దు వరకు వెళ్ళాలి అని బాప్‌దాదా కోరుకుంటారు. బాప్‌దాదా పిల్లల హద్దు సంకల్పాలు, హద్దు మాటలు, హద్దు సేవలు, హద్దు సంబంధాలను చాలా సమయము చూసారు, కానీ ఇప్పుడు బేహద్దు సేవల ఆవశ్యకత ఉంది. ఇప్పుడు బేహద్దు వైపు దృష్టి పెట్టండి. బేహద్దు దృష్టి తయారైనప్పుడు సృష్టి పరివర్తన అవుతుంది. సృష్టి పరివర్తన అనే ఇంత పెద్ద కార్యము కొద్ది సమయములోనే సంపన్నము చేయవలసి ఉంటుంది కనుక గతి మరియు విధి కూడా బేహద్దు వేగములో ఉండాలి.

9. హోలీహంసలైన మీరు తెల్లని వస్త్రధారులు, స్వచ్ఛమైన హృదయము అనగా స్వచ్ఛతా స్వరూపులు. తనువు, మనసు మరియు హృదయముల ద్వారా సదా మచ్చలేనివారిగా అనగా స్వచ్ఛముగా అవ్వండి. కొందరు తనువుతో అనగా బయటకు ఎంత స్వచ్ఛంగా, శుభ్రంగా ఉన్నాగానీ మనసులో శుభ్రంగా ఉండరు, స్వచ్ఛంగా ఉండరు కనుకనే మొదట మనసును శుభ్రంగా ఉంచుకో అని అంటారు. స్వచ్ఛమైన మనసు మరియు స్వచ్ఛమైన హృదయమును చూసి ప్రభువు సంతోషిస్తారు. స్వచ్ఛమైన మనసు కలవారి అన్ని కోరికలు పూర్తవుతాయి.

10. సంతుష్టమణి అనగా మచ్చలేని వజ్రము. సంతుష్టతా లక్షణము – సంతుష్ట ఆత్మ స్వయమును కూడా ప్రసన్నచిత్తముగా అనుభవము చేస్తుంది మరియు ఇతరులు కూడా వీరిని చూసి ప్రసన్నులవుతారు. ప్రసన్నచిత్త స్థితిలో ప్రశ్నచిత్తము ఉండదు. ఒకటేమో ప్రసన్నచిత్తము, రెండవది ప్రశ్నచిత్తము. ప్రసన్నచిత్తులు డ్రామా నాలెడ్జ్ ఉన్న కారణంగా ప్రసన్నంగా ఉంటారు, ప్రశ్నలు వెయ్యరు. స్వయం పట్ల లేక ఇతరుల పట్ల ఏదైనా ప్రశ్న తలెత్తిందంటే, దానికి సమాధానము మొట్టమొదట స్వయానికే లభిస్తుంది.

11. రత్నాల వ్యాపారి ప్రతి ఒక్క రత్నాన్నీ మచ్చలేని విలువైన రత్నంగా తయారుచేస్తాడు. మరి మీ అందరిదీ కూడా ఇదే సేవ. చిన్న-చిన్న మచ్చలు ఏవైతే ఉన్నాయో – వాటిని స్వచ్ఛంగా చేయటము, సంపన్నంగా చేయటము, బాబా సమానంగా చేయటము, ఈ సేవలో మజా ఉంది. అలసిపోలేదు కదా! మీ అందరి అలసిపోని స్వరూపము ద్వారా ఇతరులకు కూడా ప్రేరణ లభిస్తుంది.

12. **వేస్ట్(వ్యర్థము)ను అంతము చేస్తాము, బెస్ట్(సమర్థము)గా అవుతాము** అని ఇప్పుడు ప్రతిజ్ఞ చెయ్యండి. ఎన్ని పరీక్షలు వచ్చినాగానీ పరీక్ష పరీక్షే, ప్రతిజ్ఞ ప్రతిజ్ఞే. పరీక్ష వచ్చినట్లయితే ప్రతిజ్ఞను గుర్తుచేసుకోండి. అందరూ బెస్ట్‌గా అయిపోయినప్పుడే ప్రత్యక్షతా జెండాను ఎగురవేస్తారు. మీ కొరకు ఆగి ఉంది. పరదా తొలగినప్పుడు కూడా ఇంకా మీరు రెడీ అవుతూనే ఉంటే మంచిగా అనిపిస్తుందా! కనుకనే పరదా వేసి ఉంది.

13. చాలా విలువైన, అమూల్యమైన, మచ్చలేని వజ్రానికి ఎదురుగా లైట్‌ను ఉంచినట్లయితే అది ప్రకాశిస్తుంది, ప్రకాశించినప్పుడు దాని కిరణాలు వెలువడతాయి, వాటిలో భిన్న-భిన్న రంగులు కనిపిస్తాయి. మరి మీరు ఎప్పుడైతే నిజమైన వజ్రంగా అవుతారో, ఫరిశ్తాగా అవుతారో అప్పుడు మీ ఫరిశ్తా స్వరూపము ద్వారా ఈ అష్ట శక్తులు కనిపిస్తాయి. ఎలా అయితే ఆ రంగు కిరణాల రూపంలో కనిపిస్తుందో, అలా మీరు వజ్రంలా అనగా ఫరిశ్తా రూపులుగా అయినట్లయితే నడుస్తూ-తిరుగుతున్న మీ నుండి అష్ట శక్తుల కిరణాల అనుభూతి ఉంటుంది.

14. నేనైతే సత్యంగా ఉన్నాను కానీ నన్ను ఎవరూ అలా అర్థం చేసుకోరు అని చాలా మంది పిల్లలు భావిస్తారు కానీ సత్యమైన మచ్చలేని వజ్రము ఎప్పుడూ దాగియుండలేదు. ఒకవేళ ఎవరైనా నేను ఇలాంటివాడిని కానీ ఎవ్వరూ నన్ను అర్థం చేసుకోరు అని భావిస్తే అది కూడా సత్యత కాదు. సత్యత ఎప్పుడూ దాగియుండదు మరియు సత్యత కలవారు అందరికీ ప్రియమనిపిస్తారు. మేము దగ్గరగా లేము కనుక ప్రఖ్యాతమవ్వలేదు అని కూడా కొందరు భావిస్తారు కానీ ఎవరైతే సత్యంగా మరియు పక్కాగా ఉంటారో వారు దూరంగా ఉన్నా కూడా తమ గుర్తింపును దాచలేరు.

15. సాకార రూపము కొరకు వర్ణించినది ఏమిటంటే – వీరు ఎవరో అలౌకిక వ్యక్తి అని తెలియనివారు కూడా తెలుసుకోగలిగేవారు. వేలాదిమంది మధ్యలో ఆ వజ్రము మెరుస్తూ ఉండేది. అలానే ఫాలో ఫాదర్. ఇప్పుడు సేవ కారణంగా కొంతమంది ప్రాపంచిక వ్యక్తులతో కలుస్తూ ఉంటారు కానీ సేవ కొరకు సంబంధములో ఉన్నా కూడా అతీతంగా ఉండేందుకు ఏ మంత్రమైతే ఉందో – దానిని మర్చిపోకూడదు. లౌకికములో ఉన్నప్పుడు కూడా అలౌకికతను అనుభవము చేయించండి.

16. ఇప్పుడు మీరు ఎటువంటి మచ్చలేని స్థితిని తయారుచేసుకోవాలంటే లోకుల దృష్టి స్వతహాగా మీవైపుకు వెళ్ళాలి. స్టేజ్ సెక్రెటరీ మీ పరిచయము ఇవ్వకపోయినా కానీ మీ స్టేజ్ (స్థితి) స్వయమే పరిచయమివ్వాలి. మట్టిలో దాగియున్న వజ్రము తన పరిచయాన్ని తానే ఇస్తుంది. అలా ఈ సంగమయుగ వజ్రతుల్య జీవితము మీ పరిచయమును స్వయమే ఇవ్వగలదు. ఇందుకొరకు సాధారణ రూపంలో అసాధారణ స్థితి యొక్క అనుభవమును స్వయము కూడా చెయ్యండి మరియు ఇతరులకు కూడా చేయించండి. బాహ్యాముఖతలోకి వచ్చే సమయములో అంతర్ముఖతా స్థితిని కూడా పెట్టుకోండి.

**18.06.13**

**శివబాబా గుర్తున్నారా?**

**"బాబాతోపాటుగా ఎగరాలనుకున్నట్లయితే బుద్ధి ప్లెయిన్‌గా ఉండాలి, తేలికగా ఉండాలి, ఏ విషయాన్నైనా దానినే పట్టుకుని కూర్చోకండి" (జానకి దాది)**

ఇలాగే శాంతిలో కూర్చుండిపోవాలని మనసు చెప్తుంది, శాంతిధామము వెళ్ళాలని అందరి మనసులోని భావన. ఇక్కడ కార్యవ్యవహారములలో ఉన్నాగానీ మొదటి నుండే బుద్ధి శాంతిధామములో ఉండాలి. మమ్మా, బాబా సాకారములో ఉన్నా కూడా ఉపరామముగా ఉండేవారు, ప్రతి అడుగులో పదమాల సంపాదన జమ ఉండాలి అని సూక్ష్మ ధ్యానమును ఉంచుకునేవారు. మరి అందరికీ ఈ భావన మరియు అనుభూతి తెలుస్తుంది కదా! ప్రతి ఆత్మ స్వయమును పరమాత్మ సంతానంగా భావించి సుఖకర్త–దుఃఖహర్త అయిన బాబా వరదానాలతో సదా సుఖంగా ఉండాలి, ఇదే కోరిక కదా! బుద్ధి ఎల్లప్పుడూ ప్లెయిన్‌గా, తేలికగా ఉన్నట్లయితే బాబాతోపాటు ఎగరటము సహజమౌతుంది. ఖాళీ చేతులతో వచ్చాము, ఖాళీ చేతులతో వెళ్ళాలి. ఎవరైనా శరీరము వదిలినప్పుడు ఖాళీ చేతులతో వెళ్తారు. ఏ విషయాన్నైనా అలాగే పట్టుకుని కూర్చోవద్దు లేకపోతే అపాయము అని బాబా అంటారు. దాన్నే పట్టుకుని కూర్చున్నట్లయితే అది వదలనే వదలదు. ఇంటికి వెళ్ళాలంటే ఇప్పుడు ఇన్ని ఏర్పాట్లను చేసుకోవాలి. చావు ఎప్పుడు వస్తుందో తారీఖు ఎవరికీ తెలియదు కానీ మృత్యువైతే తప్పక వస్తుంది కనుక ఎప్పుడు వినాశనమవుతుంది అన్నదానిని గురించి ఆలోచించకండి.

ప్రతిరోజూ వినే మురళిలో నుండి ఏదో ఒక విషయము గురించి లోతులలోకి వెళ్ళినట్లయితే లైట్ మరియు మైట్‌ల అనుభవము కలగటము ప్రారంభమవుతుంది. లైట్ హౌస్ అందరికీ దారిని చూపించే పని చేస్తుంది. సాగరతీరాలలో చాలా లైట్‌హౌస్‌లు ఉంటాయి. బాబా గైడ్‌గా అయ్యి మనల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చారు, ధన్యవాదాలు బాబా! మీరు మాకు ఇంటికి దారిని చూపించారు మరియు తోడుగా తీసుకువెళ్తానని ప్రతిజ్ఞ చేసారు. ఎవరికైతే ఈ అనుభూతి ఉంటుందో, వారు ఎలా వెళ్ళాలి అని ఎప్పుడూ అనరు. ఇన్ని సంవత్సరాలు గడిచిపోయాయి, అయినా ఎవరైతే నవ్వుకుంటూ పాడుకుంటూ నడుస్తున్నారో వారు తమను తాము పదమాపదమ భాగ్యశాలురుగా భావించి తోడుగా నడుస్తున్నారు మరియు తోడుగా ఉంటారు, ఇది గ్యారంటీ. ఈ సూక్ష్మ నషా, సంతోషము ఉంటాయి. మొదట మన పరివారము చిన్నదిగా ఉండేది, ఇప్పుడు ఈ పరివారము పెద్దదైపోయింది, అయినా కూడా మంచిగా ఉంది, ఎంత పెద్దదిగా ఉంటుందో అంత సంతోషము ఉంటుంది అని మేము అంటాము. మేము బాబాకు చెందినవారిగా అయ్యాము అన్న ఈ సంతోషమైతే ఉంది, ఇంత పెద్ద పరివారము, నలువైపులా కల ఇంత పెద్ద రచనను చూసి అందరికీ ఇంకా ఎక్కువ సంతోషము ఉంటుంది. అచ్ఛా, ఓం శాంతి.

**"చింత లేని చక్రవర్తి స్థితిని తయారుచేసుకోండి"**

ఓం శాంతి. బేఫికర్ బాద్‌షా (చింతలేని చక్రవర్తి)లు కూర్చున్న సభ ఇది, ఫికర్ (చింత)కలవారు ఎవరైనా కూర్చుని ఉన్నారా? రాజు అని అనరు, చక్రవర్తి. చింతలేని చక్రవర్తులు, నిశ్చింతపురి చక్రవర్తులు. లక్ష్మీనారాయణులు మహారాజు, మహారాణులుగా అయితే తరువాత అవుతారు. కానీ ఇప్పుడు సంగమయుగంలో నిశ్చింత చక్రవర్తులు. చింత మరియు ఆత్రుతలో అయితే అంతరము ఉంది కదా. చింత నిరాశావాదిగా తయారుచేస్తుంది, నిరాశ కలవారిగా తయారుచేస్తుంది. చింతనుండైతే విముక్తులైపోయారు. స్వచింతన–ఈశ్వరీయ చింతన. స్వయములో ఈశ్వరుని చింతన ఉండాలి. కరెక్ట్ అని అనుభవము చెయ్యండి. ఈశ్వర చింతన అంటారు, భగవాన్ చింతన అని అనరు. భగవంతుడైతే భాగ్యవిధాత, కానీ చింతనలో ఈశ్వరుడు ఉన్నారు. ఒకటేమో నీ సహాయము, మరొకటి ఆధారము, ఇవి భక్తిలోని మాటలు. ఆ ఒక్కరే నా ఆధారము. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగినా చింతించాల్సిన అవసరము లేదు, ఏది జరగాల్సి ఉందో అది జరిగే తీరుతుంది.

మీకు ఎవరికీ ఏ విషయమును గురించిన చింత అయితే లేదు కదా? చింత ఉంటే అది నిశ్చయబుద్ధిగా అవ్వనివ్వదు. నిశ్చయములోనే విజయము ఉంది కనుక స్థిరము–దృఢము. చింత ఎందుకు! నిశ్చయములోనే విజయము ఉంది. ఏ కొంచెము సంశయము ఉన్నాగానీ అనేక రకాల సంశయాలు ఉత్పన్నమవుతాయి. ఒకటేమో సంశయము, ఇంకొకటి సందేహము. సంశయము కలవారికి స్వయములో నిశ్చయము ఉండదు, బాబాలో నిశ్చయము ఉండదు, ఇతరులపై నిశ్చయము ఉండదు, సందేహము కలుగుతుంది. ఇలా అయితే చెప్తారు కానీ ఇలా జరుగుతుందా...... సంశయము ఉండదు, కానీ సందేహము ఉంటుంది.

మీకు సేవను గురించిన ఆత్రుత చాలా ఉందని నేను గమనించాను, చింత కాదు, ఆత్రుత. సేవలో చాలా లాభము ఉంది కదా. బాబాను చాలా బాగా గుర్తు చేసినట్లయితే వికర్మాజీతులుగా అవుతారు అని ఒకవైపు బాబా అంటారు, మళ్ళీ భ్రమరిలా భూ, భూ చెయ్యండి

అని ఇంకోవైపు అంటారు. రెండు విషయాలూ కరెక్టే. నేను వికర్మాజీతునిగా అయ్యానా అని స్వయమును చూసుకోవాలి. వికర్మాజీతుల లక్షణము ఏంటి? వారికి ఎటువంటి వికల్పాలూ రావు. సంకల్పము వచ్చినాగానీ అది అటువంటి పనే చేయిస్తుంది. సంకల్పము చాలా సూక్ష్మమైన విషయము, కనుక మనసు శాంతము, హృదయము స్వచ్ఛము. ముఖము చిరునవ్వుతో ఉండాలి. భగవంతుని దయ వలన మనసు శాంతముగా ఉంటూ, చంచలముగా లేనట్లయితే హృదయము చాలా సంతోషంగా ఉంటుంది. వాహ్ బాబా వాహ్! మనసు శాంతిగా ఉన్నట్లయితే బుద్ధిలో వచ్చే సంకల్పాలు అతి శుద్ధమైనవిగా ఉంటాయి. సంకల్పాలు శ్రేష్ఠముగా, దృఢముగా ఉండాలి. దృఢతాపూర్వక సంకల్పాలు చాలా అద్భుతమైనవి. వాటివలన బుద్ధి నిశ్చయమైనదిగా అయిపోయింది. విజయము లభించే తీరుతుంది, అది స్థిరము-దృఢము. ఏ కార్యమైతే జరిగేది ఉందో అది జరిగే తీరుతుంది. ఎందుకు దిగులు పడ్తారు!

మరి నిశ్చింతగా ఎలా ఉంటారు? చింత నుండి ముక్తులైన చక్రవర్తులు. నేను బాబా వద్దకు మొట్టమొదటగా వచ్చినప్పుడు బాబా – బిడ్డా, నువ్వు ఎక్కడ ఉంటావు అని నిన్ను ఎవరైనా అడిగితే నేను నిశ్చింతపురిలో ఉంటాను అని చెప్పాలి, అని అన్నారు. చింతలేని చక్రవర్తులు, చింతకు చెందిన గుర్తులే లేవు.

అక్కయ్యలు భట్టీ చెయ్యటానికి వచ్చారు, ఈ విషయాలన్నీ మీకొరకు పెద్ద విషయాలేం కావు, ఎందుకని? సేవకు నిమిత్తులు. సేవ దిగులు లేదు. కాస్త ఇది కష్టంగా ఉంది, వీరు ఇలా చేస్తారు, వారు అలా చేస్తారు..... ఇటువంటి ఆలోచన, తెలివే లేదు. పూర్తిగా సహజము. రాజయోగము సహజయోగము. యోగములో కష్టము లేదు, ఇక్కడ కూర్చుని ఉన్నప్పుడు, సేవలో ఉన్నాగానీ స్వ సేవలో సర్వ సేవలు ఇమిడి ఉన్నాయి. భవిష్యత్తు గురించి చింత లేదు. రేపు ఏం జరుగుతుందో తెలియదు అని ఇలా అనజాలరు. నాకు చింత లేదు కానీ అటెన్షన్ ఉంది. ఒకవైపు నన్ను బాబా చూస్తున్నారు, రెండవవైపు ప్రపంచము చూస్తూ ఉంది. బాబా పిల్లలందరూ నన్ను చూస్తున్నారు, బాబా నా వెనుకే ఉంటారు, మొత్తము రోజంతా చూస్తుంటారు, నిద్రపోనివ్వరు. ఫిర్యాదు చెయ్యటం లేదు. ప్రపంచము చూస్తూ ఉంది, వైబ్రేషన్‌లు వెళ్తాయి. ఇటువంటి అటెన్షన్ ఉన్నప్పుడు బాబాకు ఏం మంచిగా అనిపిస్తుంది? నా పిల్లలు నిశ్చింత చక్రవర్తులుగా ఉన్నట్లయితే వీరు ఎవరి సంతానమన్నది అందరికీ తెలుస్తుంది.

హమ్‌నే దేఖా, హమ్‌నే పాయా, శివ భోలా భగవాన్..... (శివ భోళా భగవంతుడిని మేము చూసాము, పొందాము) అన్న ఈ పాటను తయారుచేసినప్పుడు బాబా ఇలా అన్నారు – ఇది తప్పు, హమ్‌నే జానా, హమ్‌నే పాయా.... (మేము తెలుసుకున్నాము, మేము పొందాము) అని పిల్లలు అనాలి. మన నోటి ద్వారా అనే ఒక్కొక్క మాటలో నిశ్చయపు నషా ఎక్కి ఉండాలి. మిగతా అన్ని నషాలలో నష్టము ఉంది. ఏరకమైన నషా ఉన్నాగానీ, సేవ గురించి కూడా నషా ఎక్కి ఉంటుంది, కొద్దిగా అయినా ఆ నషాలో దేహ అభిమానము ఉన్నట్లయితే అది నష్టపరుస్తుంది. కోరిక అనుసారంగా జరగనట్లయితే లోపల ఫీలింగ్ వస్తుంది, ఇది దేహ అభిమానము కనుక ఇచ్ఛామాత్రం అవిద్య అని బాబా అంటారు. నిశ్చింతులుగా ఉండేందుకు ఇవన్నీ గుర్తులు.

ఈ విషయము ఎలా కరెక్ట్ అవుతుంది, నాకు కాస్త చింత ఉంది, ఇందులో చాలా సమయము పట్టింది..... ఇటువంటి చింతలు చాలామందికి ఉంటాయని నేను భావిస్తాను. ఈ విషయము నా వద్దకు కూడా వస్తుంది అని ఎప్పుడూ అనుకోలేదు, ఇప్పుడు ఎవరికి వినిపించాలి, ఎవరు నిర్ణయిస్తారు – అని ఇటువంటి చింత ఉంటుంది కదా!

మీరు కూడా సేవలో ఉన్నారు, మేము కూడా మొదట్లో భారతదేశ సేవలోనూ ఉన్నాము, విశ్వసేవలోనూ ఉన్నాము. ఒకవేళ దిగులు పడే స్వభావము ఏ కాస్త ఉన్నాగానీ మేము ఇంతవరకూ చేరుకోలేకపోయేవారిమి. చాలాసార్లు శరీరము పరీక్ష తీసుకుంటుంది, కానీ చింత ఉండదు. అంతమతి సో గతి మంచిగా ఉండాలి అన్న ధ్యానమైతే ఉంది. ఆ, ఊ అంటూ ఆత్మ శరీరము నుండి బయటకు వెళ్ళకూడదు. మొదటి నుండీ ఏ సేవ ఉంది? మన్మనాభవ, మధ్యాజీ భవ. లోపల నుండి స్థిరమైన-దృఢమైన స్థితి ఉండాలి, అలజడి ఉండకూడదు. అకస్మాత్తుగా ఏం జరిగినా గానీ మీరైతే ఎవర్‌రెడీగా ఉండండి అని బాబా అంటారు. బాబా మహావాక్యాలు ఏవైతే ఉన్నాయో వాటిలో ఎక్యురేట్‌గా, ఎవర్‌రెడీగా ఉండాలి. కొంతమందికి పరస్పరములో లెక్కాచారాలు కూడా ఉంటాయి.

సాకారములో బాబాను ప్రాక్టికల్‌గా చూసాము, బాబా ఎదురుగా అనేక విషయాలు వచ్చాయి, అనేకమంది పిల్లల ఆట చూసారు, కానీ బాబా ధ్యానము తన స్థితిపై చాలా ఉండేది, అందుకే మనమందరమూ ఇప్పుడు ఇక్కడ ఇలా కూర్చున్నాము. ఒకవేళ బాబా ఇంత ధ్యానము పెట్టనట్లయితే, దీదీ-దాదీలు ఇంత ధ్యానము పెట్టనట్లయితే మీరు ఇక్కడ ఉండేవారు కారు. చంద్రమణి దాదీ, దీదీకి తమ స్థితిపై ఎంతగా ధ్యానముండేదో అంతగానే మనపై మనము కూడా అంతటి ధ్యానమును ఉంచుకోవాలి. ఒకవేళ దాదీకి చింత చేసే స్వభావము ఉన్నట్లయితే ఈరోజు శాంతివనము ఉండేది కాదు. ఇవన్నీ ఎలా తయారయ్యాయి? ఇప్పుడు డైమండ్ హాల్ చిన్నదైపోయింది. విచిత్రము బాబా అని నేను అంటే బాబా అన్నీ మంచిగా అయిపోతాయి బిడ్డా అని అంటారు. ఈ దృశ్యము చాలా సుందరమైనది. ఏ కాస్త కూడా కదిలే విషయము లేదు, ఏ కొంచెము కూడా కదలకూడదు. ఇటువంటి అంతిమ స్థితిని ఇప్పుడిప్పుడే తయారుచేసుకోవాలి. భట్టీ అనగా సంగఠన.

సంగఠనలో ఈ విషయాలు స్పష్టము చెయ్యటము సులభమవుతుంది.

ప్రశ్న – అటెన్షన్ పెట్టినప్పుడు చింత రాదు కానీ మీది ఎలా అయితే నేచరల్ సంస్కారము తయారైందో, అది ఎలా తయారైంది?

జవాబు – సీ ఫాదర్. బాబా ఎలా కూర్చున్నారు? ఎప్పుడూ ఒక కాలుపై మరొక కాలు వేసుకుని కూర్చుంటారు, ఎల్లప్పుడూ ఇలాగే చూసాను. రెండవది – బాబా పడుకుని ఉన్నారు, విచారసాగరమంథనము చేస్తున్నారు. నేను ఒకరోజు ఉదయమున బాబా వద్దకు వెళ్ళినప్పుడు బాబా పడుకుని ఉన్నారు, బిడ్డా, నువ్వు విచారసాగరమంథనము చేస్తావా అని బాబా నన్ను అడిగారు. ఆ రోజు, ఈ రోజు, ఉదయం అవ్వటంతోనే ఏదో ఒక మురళి పాయింట్‌పై ఆలోచనలు నడవటము మొదలైపోతుంది. మంథనము చెయ్యటంలో చాలా మజా వస్తుంది. మళ్ళీ ఎప్పుడైనా నాకు అవకాశము వచ్చినప్పుడు వినిపిస్తాను. మురళిని వినిపించే ముందు కూడా విచార సాగర మంథనము చేసినది వినిపిస్తాను. ఆ జ్ఞానము అమృతము అవుతుంది, మధురంగా అనిపిస్తుంది, రత్నాలవలె విలువైనదవుతుంది. జ్ఞానము అమృతము కదా! మంథనము చెయ్యటం వలన అమృతము వెలువడుతుంది. పెరుగును చిలికినట్లయితే వెన్న కూడా వస్తుంది, మజ్జిగ కూడా వస్తుంది. వెన్న శక్తినిస్తుంది, మజ్జిగ చల్లబరుస్తుంది. ఉదయం పూట కాస్త వెన్న తినండి, ఎవరైనా బలహీనంగా ఉన్నట్లయితే ఉదయాన్నే వీరికి కాస్త వెన్నను తినిపించండి, లేనట్లయితే తాజా వెన్న నుండి తీసిన నెయ్యిని కాస్త త్రాగించండి అని బాబా అనేవారు. మరి మన దాదీలు తమ స్థితిని ఎలా తయారుచేసుకుని ఉంచుకున్నారు! పరదాదీకి శరీరము ఎలా ఉన్నాగానీ ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. నన్ను ఎప్పుడూ జనక్‌రాజ్ అని అనేవారు, గుల్జార్ దాదీని గుల్ గులాబీ అని అనేవారు. ఎప్పుడూ దాదీల ముఖంలో చింతకు చెందిన చిహ్నాలను చూడలేదు.

చింత ఉంటే అది నిద్ర పోనివ్వదు. ఎవరైనా తోడు ఇవ్వనంతవరకూ, నా మాటనైతే ఎవ్వరూ అర్థం చేసుకోవటం లేదు అని అంటారు. కానీ ఏం జరిగినాగానీ మనము మన స్థితిపై ధ్యానమును ఉంచుకోవాలి, ఎవరు ఇలా ఉంచుకోకపోయినా ఫరవాలేదు, మీరైతే ధైర్యమును ఉంచండి. ఒకవేళ ఎవరైనా కారణమును చెప్తే నేను దానిని గురించి కొంచెము చింతించినాగానీ ఆ కారణము ఇంకా పెద్దదైపోతుంది, అప్పుడిక నేను ఎక్కడికి వెళ్ళాలి! కారణము వచ్చినా గానీ దానికి నివారణ – స్థితి. స్థితిని నేను తయారుచేసుకోవాలి, స్థితిని తయారుచేసుకోవటంలో బాబా సహాయం చేస్తారు, తోడు ఇస్తారు. నేను ప్రతి ఒక్క సోదరికీ హృదయపూర్వకంగా చెప్తున్నాను – మీరు ఎప్పుడూ ఎలా అన్న మాటను మాట్లాడకండి. మీరు ప్రాక్టికల్‌గా దాదీలను చూసారు.

ఎవరో నన్ను ఇలా అడిగారు – దాదీ, దాదాగా అయ్యేందుకు పురుషార్థము ఏంటి? విశ్వరతన్ దాదా, చంద్రహాస్ దాదా, ఆనందకిశోర్ దాదాలను అందరూ చూసారు. వారు అందరూ తమ స్థితిని ఎలా తయారుచేసుకున్నారు! చంద్రమణి దాదీ తన స్థితిని ఎలా తయారుచేసుకున్నారు! అద్భుతము, దాదీ చంద్రమణి నా బ్రాహ్మణిగా ఉండేవారు. ఒక్కొక్క దాదీకి 25-25 మంది సోదరీలు ఉండేవారు, వారు వీరిని సంభాళించేవారు. వీరిని నాకు ఇవ్వండి, వీరు నాతో ఉంటే నాకు సహాయము చేస్తారు అని చంద్రమణిదాదీ మమ్మాను అడిగారు. నేను కూడా దాదీని అవుతాను, నేను పెద్దదానిగా ఉండాలి అని నేను ఎప్పుడూ ఆలోచించలేదు. నన్ను పెద్దవారిగా భావించాలి అని భావించేవారు ఎప్పుడూ పెద్దవారిగా అవ్వలేరు. ఈ రోజుల్లో ఈ రోగము ఉంది.

ఎవరి గురించైనా ఒకవేళ దృష్టిలో దోషము ఉన్నట్లయితే ఆ దోషపూరిత దృష్టి ఎందుకూ పనికిరాదు, సూక్ష్మము కదా. బాబా దృష్టిలో వారు ఎటువంటి ఆత్మలైనాగానీ, అజామిల్ వంటి పాపులైనా, గణికులలాంటివారైనాగానీ వారిని బాబా తమ

దృష్టి ద్వారా ఉద్ధరణ చేసారు. ఈ కళ్ళతో చూసాము. బాబా ఎప్పుడూ ఎవరిలోని దోషాన్నీ చూడలేదు. దోషాన్ని చూడటము అనగా వికర్మల ఖాతా తయారవ్వటము, మరి అటువంటప్పుడు వికర్మాజీతులుగా ఎలా అవుతారు! నిశ్చింతగా ఉంటూ వికర్మాజీతులుగా, కర్మాతీతులుగా అవ్వాలి.

దీదీపై నాకు చాలా ప్రేమ ఉండేది, దీదీ శరీరము వదిలే సమయానికి నాకు అనారోగ్యంగా ఉంది, నేను దేహం వదిలే స్థితిలో ఉన్నాను కానీ దీదీ వెళ్ళిపోయారు. దీదీ పురుషార్థము చేసి కర్మాతీతంగా అయిపోయారు అన్నది నేను చూసాను. దీదీ చాలా ఎక్యురేట్ యోగము చేసేవారు. బాబా, శరీరములో ఉంటూనే కర్మాతీత స్థితి యొక్క అనుభవమును చెయ్యలేమా అని నేను బాబాను అడిగాను. దీదీ నాకు కొత్త ఆయుష్షును ఇచ్చి వెళ్ళారు. ఈ సేవ నువ్వు చేస్తావు, ఈ విషయంపై వెళ్ళి భాషణ ఇవ్వు, క్లాస్ చేయించు అని ఎప్పుడూ అనేవారు, మరి సేవ అంటే ఏంటి? స్వ స్థితిపై ధ్యానము. అచ్చా!

## "నిరాకారి, నిర్వికారి మరియు నిరహంకారీ స్థితిని తయారుచేసుకోండి"

నిరాకారి, నిర్వికారి, నిరహంకారి స్థితి ఎలా ఉంటుంది అనేదానిని మధురాతి మధురమైన గుల్జార్ దాదీ ముఖము చూసినప్పుడు, వారి మాటలు విన్నప్పుడు ఆ అనుభవము ప్రాక్టికల్‌గా కనిపిస్తుంది. దాదీ ముఖము చూస్తుంటే అలా అనిపిస్తుంది కదా! మళ్ళీ మీ ముఖమును చూసుకోండి. కొద్ది సమయము నిరాకారీ స్థితిలో స్థితులై కూర్చోండి, ఇటూ-అటూ చూడకండి. ఏమీ మాట్లాడకండి, ఏమీ ఆలోచించకండి. నిరాకారి స్థితి అనగా అశరీరి స్థితి, బీజరూప స్థితి. దృష్టి ద్వారా చూస్తున్నారు, కానీ చూస్తున్నాగానీ నిరాకార స్థితి యొక్క అనుభవము ఉండాలి. ఏ మాటలైతే వింటారో ఆ అనుభవము చెయ్యాలి అన్నది నా భావన. మనము కేవలము మాటలను వినము, మాటల అర్థాన్ని తెలుసుకుంటాము, ఇప్పుడు మనము ఏదైతే ఓం శాంతి అని అంటామో ఓం అన్నదాని అర్థము శాంతి, ఓం అంటే శక్తి, ఎక్కడైతే శాంతి ఉంటుందో, శక్తి ఉంటుందో అక్కడ ఆటోమేటిక్‌గానే సంతోషము ఉంటుంది. నిరాకారీ స్థితి యొక్క పవర్ నిర్వికారిగా తయారుచేస్తుంది, ఎటువంటి వికారమూ లేదు, కామము లేదు, క్రోధము లేదు, లోభము లేదు, ఎటువంటి మోహమూ లేదు, అహంకారము యొక్క అంశము లేదు. అహంకారమును చివరిలో చూపించటం జరుగుతుంది, కానీ అహంకారము మూలము. జ్ఞానమార్గములో ఎక్కితే ప్రేమ రసము, కానీ ఒకవేళ తప్పటడుగు వేసి మాయకు వశమై దిగజారితే అధః పాతాళానికి పడిపోతారు, ఎముకలు సైతం విరిగిపోతాయి. కనుక నిరాకారీ స్థితి ఎంతవరకు ఉంటుంది అన్న విషయంలో మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. శివబాబా ఎలా అశరీరియో, బిందురూపులో, సర్వశక్తివంతులో, అలా స్థితిలో నికారారి, స్థూలము మరియు సూక్ష్మ శరీరము ద్వారా అతీతము, అభిమానము నుండి దూరము.

నిరాకారి స్థితి ఉన్నట్లయితే ఏకాగ్రత యొక్క మంచి అనుభవము ఉంటుంది, బుద్ధి స్థిరంగా ఉంటుంది. నామరూపాలకు అతీతము, ఇటువంటి స్థితిలో లోపల లోపలే అభ్యాసము చేస్తూ-చేస్తూ ఒకానొక సమయములో ఆశ్చర్యమనిపిస్తుంది. సంగమయుగములో బాబా నిరాకారి స్థితిని అనుభవము చేయించి పరంధామమునకు తీసుకువెళ్ళేందుకు తయారుచేస్తున్నారు. నిరాకారి స్థితిలో ఉండటం ద్వారా, కర్మ సంబంధాలలో ఉంటూనే కర్మ కూడా శ్రేష్ఠంగా, ప్రేరణను ఇచ్చే యోగ్యమైనదిగా ఉంటుంది. చూడటము, మాట్లాడటము, నడవటము...... అన్నింటిలో శ్రేష్ఠత ఉండాలి. దేవతామూర్తులను దర్శించుకుంటారు, కానీ దేవతల రాజ్యము ఉన్నప్పుడు ఎలా ఉంటుంది? అర్థం చేసుకోండి, ఊహించుకోండి. ఇప్పుడు నిర్వికారులుగా అయ్యారు కదా! నిర్వికారి స్థితి ద్వారా ఈశ్వరీయ సంతానంగా అయ్యారు. బుద్ధి శుద్ధంగా, శాంతిగా ఉన్నట్లయితే శబ్దము నుండి దూరంగా ఉండటం మంచిగా అనిపిస్తుంది. నాలెడ్జ్ ఉంది కనుక ఈజీ. నిరాకార బాబా బ్రహ్మాబాబా ద్వారా నిరాకారి స్థితి ద్వారా నిష్కామిగా తయారుచేసారు. నిరాకారి నుండి నిర్వికారి, తర్వాత నిరహంకారి. మూడు రూపాలను ఇమర్జ్ చేసుకోండి, బాబా ఎదురుగా కూర్చున్నారు, మధురమైన బాబా తతత్వం అని అంటారు. భగవంతుని కోరిక ఇది. శివబాబా బ్రహ్మ తనువు ద్వారా మన స్థితిని, నిరాకారి, నిర్వికారి స్థితిగా తయారుచేస్తున్నారు. ఇది సంగమయుగము, సమయ మహత్వము ఉంది. ఎంత మంచి సమయము!

సంగమయుగమును ఎదురుగా చూసినట్లయితే ఈ ప్రపంచము కనిపించదు. నిరాకారీ ప్రపంచములోకి వెళ్ళే ఆకర్షణ కలుగుతుంది. ఇక్కడ నిమిత్తమాత్రముగా ఉన్నాము. సదా సీ ఫాదర్, ఫాలో ఫాదర్ చేస్తూ ఋజువును ఇచ్చేందుకు సుపుత్రులైన పిల్లలుగా అవ్వాలి. సంగమయుగములోని ఈ చదువులో చాలా సంపాదన ఉంది. నామరూపాలు, దేశకాలాల నుండి దూరంగా వెళ్ళండి, దేశమూ గుర్తుండకూడదు, సమయమూ గుర్తుండకూడదు, దేహభానము నుండి దూరము. ఎక్కడ ఉన్నాగానీ నేను భారతదేశమును స్వర్గముగా చేసే సేవ చెయ్యాలి, అప్పుడే స్వర్గములోకి వెళ్తాను, స్వర్గములోకి ఇలాగే అయితే రారు. ఎవరైనా చనిపోయినప్పుడు స్వర్గవాసి అయ్యారు అని అంటారు. పాపం, వారికి అంత మతి సో గతి ఎలా ఉన్నది అన్నది ఇప్పుడు ప్రాక్టికల్‌గా మనము చూసాము. జ్ఞానమార్గములోకి రావటం ద్వారా అంతమతి సో గతి ఎలా ఉంటుంది అన్నది చూసాము. ఏదైనా కర్మభోగములో శరీరమును వదిలినట్లయితే కర్మభోగము, లెక్కాచారము సమాప్తము అయిపోయి ఉండాలి అని లోపల నుండి మనకు స్వయం పట్ల భావన కలగాలి. శరీరమునకు ఏం జరిగినాకానీ కర్మభోగము ఉండకూడదు.

ఆత్మలో పరమాత్మ శక్తి నింపారు, లెక్కాచారము సమాప్తమైపోయింది, దీనిని కూడా పరిశీలించుకోవాలి. నిరాకారి స్థితిలో ఆత్మలైన మనమందరమూ పరమాత్మ సంతానము. ఒకసారి అందరమూ చాలా మంచిగా యోగములో సైలెన్స్‌లో కూర్చుని ఉన్నాము, అప్పుడు బాబా – అందరూ ఎక్కడ కూర్చుని ఉన్నారు అని అడిగారు. ఎవ్వరమూ సమాధానము చెప్పలేదు ఎందుకంటే అందరమూ సైలెన్స్‌లో మునిగిపోయి ఉన్నాము, అప్పుడు మళ్ళీ బాబా అందరూ ఎక్కడ కూర్చుని ఉన్నారు అని అడిగారు. అప్పుడు అందరమూ ఇంకా ఎక్కువ సైలెన్స్ యొక్క లోతులను అనుభవము చెయ్యటము మొదలుపెట్టాము. అలా ఇప్పుడు నేను మిమ్మల్ని అడుగుతున్నాను, అందరూ ఎక్కడ కూర్చున్నారు? ప్రియమైన బాబా దేనినైతే అనుభవము చేయించారో అది మీకందరికి కూడా అనుభవము అవ్వాలని నా మనసు కోరుకుంటుంది. పిల్లలు ఎవ్వరూ సమాధానము ఇవ్వకపోవటమును బాబా చూసారు, అప్పుడు బాబా నవ్వుతూ ఇలా అన్నారు, పిల్లలూ, బ్రహ్మాండములో

కూర్చుని ఉన్నారు మీరందరూ. అండము వలె ఆత్మలు కూర్చుని ఉన్నాయి కదా. బాబా, దీనినైతే మేము ఎప్పుడూ ఆలోచించను కూడా ఆలోచించలేదు అని అన్నాము.

బెగ్గరీ పార్ట్ సమయము నుండి కూడా మొత్తము జీవితములో శరీరానికి ఏదో ఒక కష్టము కలుగుతూనే ఉంది, ఒక్కోసారి శాంతిలో కూర్చుని బాబా, ఇప్పుడు నేను ఏం సేవ చేయ్యాలి అని ఆలోచించేదానిని. యజ్ఞసేవను చేసేందుకు ఆ ప్రభువుకు ప్రియమైనవారు ఎవరైనా తయారవ్వాలి... ఎందుకంటే యజ్ఞముపై ప్రేమ ఉంది కదా కనుక నేను ఎప్పుడు ఎక్కడకు వెళ్ళినాగానీ ముందుగా యజ్ఞము గుర్తుకు వస్తుంది, యజ్ఞమును ఎప్పుడూ మర్చిపోలేదు నేను. బాబా మరియు యజ్ఞమును బుద్ధిలో ఉంచుకుని సేవ చెయ్యటం ద్వారా బాబా పిల్లలు ఎవరో ఒక వజ్రము తప్పకుండా వెలువడుతున్నారు అన్నదానిని చూసాను. మధురమైన బాబా ఇటువంటి సేవలు చాలా చేయించారు, కానీ మొదటగా మన స్థితి నిర్వికారిగా ఉండాలి, ఏ విధమైన వికారము ఉన్నాగానీ ఈ పనిని చెయ్యలేరు. కాస్త అహంకారము ఉన్నా నష్టము కలుగుతుంది. అహంకారము వచ్చినట్లయితే అభిమానము బాగా బుద్ధిని పాడుచేసేస్తుంది, ఎప్పుడూ శాంతి ఉండదు, మాట్లాడే పద్ధతి కూడా రాదు. భూతము వచ్చినట్లుగా అటువంటి మాటలు మాట్లాడి వాయుమండలమును భయభీతముగా చేస్తారు. మరి భూతాలను తరిమిగొట్టాలా లేక నాలో భూతము యొక్క ప్రవేశత అవ్వనివ్వాలా... నన్న టచ్ చేసినా బుద్ధి పాడైపోతుంది. ఎందుకంటే ఈరోజుల్లో వింటున్నాను, కొందరిలో ఇటువంటి వాటి ప్రవేశత ఉంటుంది, ఏమౌతుందో తెలియదు.....? లోపల లోభ, మోహ భూతాలు ఉన్నట్లయితే అవి బుద్ధిని పాడుచేస్తాయి కనుక నిరాకారి, నిర్వికారిగా అయ్యే పురుషార్థము నడుస్తూ ఉండాలి. మీ లోపల మిమ్మల్ని చూసుకోండి, ఇక్కడ ఎక్కడైనా ఏదైనా ఆశ, ఏదైనా కోరిక తిష్ట వేసి లేవు కదా, ఎందుకంటే ఆ రెండూ శత్రువులు. కోరిక అయితే తమోగుణమైనది, ఆశ రజోగుణమైనది, సతోగుణి – ఇచ్ఛా మాత్రం అవిద్య, గీతలోని మొదటి అధ్యాయము – అందరినీ మర్చిపోయి తండ్రినైన నన్నొక్కడినే గుర్తు చెయ్యండి.

ఇది దీదీ మాసము, దీదీతో మాకు చాలా మంచి ఇచ్చిపుచ్చుకోవటాలు ఉండేవి. దీదీ, దాదీలు మమ్మల్ని ఎంతటి యోగ్యులుగా తయారుచేసారంటే, ఇంత ఆయుష్షు వరకు నేను జీవించే విధంగా ఇరువురూ చేసారు. బాబా ఇలా అంటారు – ఇంటిలో నన్ను గుర్తు చెయ్యటము అనగా యోగపు వాయుమండలము ఎలా ఉండాలంటే సదాకాలము కొరకు శబ్దము నుండి దూరముగా, నష్టోమోహా స్మృతి స్వరూపపు స్థితి సహజంగా ఉండాలి. నేను స్మృతిలో ఉండాలి, ఎక్కడ ఉన్నాగానీ, ఎవరితో ఉన్నాగానీ స్మృతి స్వరూపంగా నేను ఉన్నాను. వారికి కూడా స్మృతిని ఇప్పించేందుకు..... మనకు పరస్పరములో సంబంధము ఉంది. స్మృతిలో ఇలా ఉండటము రావాలి. అన్ని విషయాలనూ మర్చిపోవాలి. ఏ విషయము కూడా నా ద్వారా మళ్ళీ రిపీట్ అవ్వకూడదు. ఏదైనా విషయము ఉన్నట్లయితే వస్తుంది, పోతుంది, కానీ మనము విషయాన్ని కూర్చోబెట్టి, భూతంగా తయారుచేసి, ఆలోచిస్తూ, విచారిస్తూ విషయాన్ని పెద్దది చేసేస్తాము, వాతావరణాన్ని మార్చేస్తాము. కనుక నిరాకారి నిర్వికారి స్థితి ద్వారా చాలా దూరము వెళ్ళిపోయాము. ప్లీజ్, ఇప్పుడు స్మృతి స్వరూపులుగా అవ్వండి. దేహసహితంగా అన్నింటి నుండీ నష్టోమోహా, అన్ని పనులు చేస్తూ కూడా అతీతము మరియు బాబాకు ప్రియమైనవారు. ఈశ్వరీయ స్నేహములో సంపన్నమవ్వాలి, ఇలా అందరూ యోగము చెయ్యండి, ఎవ్వరూ కదలకూడదు. అచ్ఛా – ఓం శాంతి

## 22-10-15

## "బుద్ధిని ఎప్పుడూ ఖాళీగా ఉంచకండి, సదా బాబాతో మధురాతి మధురమైన ఆత్మిక సంభాషణను చేస్తూ ఉండండి" (గుల్జార్‌దాది)

స్మృతిలో కూర్చున్నప్పుడు బాబాతో మధురాతి మధురమైన ఆత్మిక సంభాషణ ఉంటుంది. బాబాతో మాట్లాడేందుకు మంచిగా పర్సనల్ టైమ్ లభిస్తుంది. ఇతరులతో అయితే మాట్లాడుతూనే ఉంటాము కానీ బాబాతో పర్సనల్‌గా మాట్లాడాలి, అందుకు ఈ సమయాన్ని బాబా ఉంచారు. సాయం సమయము ఎలా అయినా యోగము సమయమే, ఇందులో ఏ విధంగా, ఎవరు ఎలా అనుభవము చెయ్యాలనుకుంటే అలా చెయ్యగలరు. సంగఠనలో కూర్చుని ఉన్నాగానీ ఎవరి ఇష్టము వారిది. కొందరికి నిరాకారి రూపములో ఉండే రుచి ఎక్కువగా ఉంటుంది, మరికొందరికి ఆకారీ రూపము ఇష్టంగా ఉంటుంది కనుక ఏ అనుభవము చెయ్యాలనుకుంటే అది చెయ్యగలరు. ఈ సమయాన్ని వ్యర్థంగా పోగొట్టుకోవద్దు, సఫలము చేసుకోవాలి. బాబా విచారసాగరమంథనము చెయ్యటమును కూడా నేర్పించారు, బాబాతో మాట్లాడే సమయము కూడా మంచిగా ఉంది. పర్సనల్‌గా మీకు ఏదైనా సమస్య ఉన్నట్లయితే దానిని బాబాకు చెప్పి దాని జవాబును తీసుకోవాలి. మధ్యమధ్యలో మనకు మనము చెయ్యగలిగే ఇలాంటి సమయము ఇంకా లభిస్తుంటుంది. అయితే పనికిరాని విషయాలను ఆలోచించకండి, ఇతర విషయాలను ఆలోచించకండి. మన పురుషార్థమునకు చెందిన విషయాలలోనే ఉండేందుకు ఆలోచించండి.

మనసులో ఏదైనా విషయమున్నా లేక పురుషార్థము కొరకు కొంత శక్తి కావాలన్నా వాటిని కూడా బాబా నుండి తీసుకోవచ్చు, మాట్లాడవచ్చు కూడా. ఈ సాయంకాల సమయాన్ని ప్రతి ఒక్కరూ ప్రత్యేకించి పెట్టుకోండి, ఇందులో బాబాను ఏ రూపములో కలవాలనుకుంటే, ఆత్మిక సంభాషణ చెయ్యాలనుకుంటే చెయ్యవచ్చు. మనది మనసు యొక్క పురుషార్థము. ఆత్మిక సంభాషణ చేసేందుకు కూడా బాబా చాలా విషయాలను వినిపించారు. బాబాతో ఏం మాట్లాడాలి, మళ్ళీ మీతో మీరు ఏం మాట్లాడుకోవాలి... ఈ అన్ని విషయాలనూ బాబా తెలియజెప్పారు. కనుక మిమ్మల్ని మీరు బిజీగా ఉంచుకోండి. ఇలా లేనట్లయితే ఖాళీ బుద్ధి ఎక్కడెక్కడికి వెళ్తుందో తెలియదు. అది మన కంట్రోల్‌లో తప్పకుండా ఉండాలి. మీకు మీరే మీ ప్రోగ్రామ్‌ను ఇచ్చుకోవాలి, ఈ అలవాటు కూడా తప్పనిసరి. మొదట్లో బ్రహ్మాబాబాలో శివబాబా వచ్చినప్పుడు, ఆ సమయములో బాబా ఎంతో అమితానందముగా మాట్లాడటంలో నిమగ్నమై ఉండేవారు, వారిని చూడటంతోనే బాబా చాలా లోతుగా బాబాతో ఆత్మిక సంభాషణ చేస్తున్నారు అని అనిపించేది. మనము కూడా మనల్ని బిజీగా ఉంచుకోవాలి. ఏదైనా భాషణను తయారుచేస్తున్నాగానీ, ఏదైనా టాపిక్ వ్రాస్తున్నాగానీ వాటిలో కూడా సమయము ఎంతగా సఫలమవుతుంది! కేవలము ఒకే విషయముపై వ్రాయద్దు, వెరైటీలో మజా వస్తుంది. వెరైటీ చెయ్యటంలో బాగుంటుంది. అంటే మనసును కంట్రోల్‌లో ఉంచుకోండి. టైమ్ గడిచిపోయింది, ఆలోచించలేదు అని ఇలా కాదు. కంట్రోలింగ్ పవర్ మనకు కొత్త కొత్త ఇన్వెన్షన్‌లను కనుగొనటంలో సహాయము చేస్తుంది. మనసుకు పనైతే కావాలి కదా, మనసు ఖాళీగా ఉండటము కూడా మంచిది కాదు. కనుక లక్ష్యము పెట్టుకోవటము వలన తేడా ఉంటుంది. మనసు కంట్రోల్‌లో ఉంటుంది. ఇంకా మన యోగమంటే ఏంటి? మనసును కంట్రోల్‌లో ఉంచుకోవటము, ఎలా కావాలంటే అలా నడవాలి. బాబా మురళి ఎలా నడుస్తుంది, మూడు నాలుగు పేజీలు దానిపైనే మననము చేసినా కూడా ఎక్కువే. మనసు-బుద్ధిని బిజీగా ఉంచుకోవాలి. ఊరికే కూర్చోవటము కాదు, ఏదో ఒకటి నడుస్తుందిలే అని కాదు, అది వేరు. కానీ కంట్రోలింగ్ పవర్ కూడా ఉండాలి, టాపిక్ అనుసారంగా నేను ఏది ఆలోచిస్తే అదే నడవాలి. ఈ అభ్యాసము ఉండాలి. ఎంత సమయము ఏది ఆలోచిస్తే, మన కంట్రోల్‌లో మనసు ఉండాలి. మొదట్లో మేము గ్రూపులు, గ్రూపులుగా అయ్యి చేసేవారిమి, ఇప్పుడు కూడా అలా చెయ్యవచ్చు. మిమ్మల్ని మీరు బిజీగా ఉంచుకునేందుకు మీకు మీరే ప్రోగ్రామ్‌ను తయారుచేసుకోండి. అచ్చా!

## "ప్రకాశమణిదాదీగారి అమృత వచనములు"

## "సంపన్నము మరియు కర్మాతీతంగా అయ్యేందుకు తపస్య"

బాబా ఎంతగా అతీతులు-ప్రియమైనవారో, అలాగే మధువన దృశ్యము కూడా అతీతంగా-ప్రియంగా ఉంటుంది. మామూలుగా కూడా సంగఠన ఉంటూ ఉంటుంది, పైగా ఈ సంగఠనను బాప్‌దాదా స్వయం పిలిచారు. ప్రాక్టికల్ ప్రేమ ఎంత ఉంది, నా పిల్లలు దివ్యత, నవీనతలకు నిమిత్తంగా అవ్వాలి, దానిపై ఆత్మిక సంభాషణ చేసేందుకు మరియు క్రొత్త ప్లాన్‌లను తయారుచేసేందుకు పిలిచారు. ఏదైనా జరగాలి అని అందరి మనసులలో వస్తుంది. బాబా కూడా పరదా లోపల ఉంచారు మరియు మేము కూడా మనసులోపల ఉంచుకున్నాము. ఆత్మిక సంభాషణ చేసి ఏదైనా నూతన ప్లాన్ తయారుచెయ్యాలని బాబా కోరుకుంటారు. మన పరివర్తన వలన విశ్వ పరివర్తన ఆగి ఉంది అని బాబా మాటల ద్వారా అనిపిస్తుంది. మీరు క్రొత్త ప్రపంచములోకి వెళ్ళేందుకు ఎప్పుడు ఎవర్‌రెడీగా అవుతారు అని బాబా పిల్లలను అడుగుతారు. చప్పట్లు కొట్టాలా, పాత శరీరము వదిలి క్రొత్త సత్యయుగ శరీరమును ధారణ చెయ్యాలి. బాబా పడుకుని ఉన్నప్పుడుగానీ లేక కూర్చుని ఉన్నప్పుడుగానీ తమ భవిష్య స్వరూపపు స్మృతిలో ఎల్లప్పుడూ ఉండేవారు. బిడ్డ, చూస్తున్నావా - నా శరీరం రూపీ కృష్ణ వస్త్రము ఎదురుగా మేకుకు వ్రేలాడుతూ ఉంది, దానిని ధరించాలి. తోడుగా ఉంటాము, తోడుగా వెళ్తాము. కనుక సంపన్నంగా అయ్యి ఎవర్‌రెడీగా ఉండాలి అని బాబా ఇదే కోరుకుంటారు. బాబా చప్పట్లు కొట్టాలి మరియు నగారా మ్రోగాలి.

బాబా ఇక్కడ చిన్నపాటి సంగఠనను జమ చేసారు. సాకార పాలన తీసుకున్నారు, అవ్యక్తునిది కూడా తీసుకుంటున్నారు. బయట ప్రోగ్రామ్‌లలో నవీనత కాదు, సంపన్నత సమీపంగా ఎంతగా రావాలంటే అందరూ చూసి శాంపుల్‌గా అవ్వాలి, బాబా కూడా చూసి సంతోషించాలి, బాబాను చూసి మనము ఎలా అయ్యామో అలా అవ్వాలి. పరివర్తన చేసుకోవటంలో ఏదైనా మిగిలి ఉంటే అది సంపన్నమైపోవాలి. కనుక ఇప్పుడు స్థాపన చేసేవారి ఏర్పాట్లు కావాలి, అప్పుడు బాబా పరదా తెరుస్తారు. మనమందరమూ కలిసి గతం గతః చేసి నవీనతను చెయ్యాలి. మీరందరూ బాబా నయన సితారలు, బాబా చేతులలో పెరిగిన శివశక్తులు కూర్చుని ఉన్నారు. ప్రేమసాగరుని ప్రేమలో పెరిగిన పుష్పాలు. ఎంత ప్రేమతో పాలన చేసారో, అంతగా అనంతమైన సేవ కోసం నిమిత్తం చేసి, శక్తిని నింపి నష్టోమోహాగా తయారుచేసారు. ఈ సంగఠనను చూస్తుంటే నా మనసులో రెండు విషయాలు వస్తాయి -

1. మనమందరమూ ప్రియమైన బాబా సమానంగా సంపన్నమూర్తులుగా అవ్వాలి – ఈ దృఢ సంకల్పము చెయ్యండి. సంపన్నము అనగా కర్మాతీతంగా అయ్యేందుకు ఈ భట్టీలో అనుభవము చెయ్యాలి. బాబా సాకారంలో ఉన్నాగానీ ఏ విధంగా కర్మాతీతంగా ఉండేవారో అలా మన స్థితి ఉండాలి.

2. సేవ కారణంగా మనసా–వాచాలలో చిన్న పెద్ద విషయాలు నడుస్తుంటాయి, ఇచ్చిపుచ్చుకోవటాలలో కూడా కింద–మీద అవుతుంటాయి. వీటిలో అతి సూక్ష్మమైన ఘర్షణలు ఏవైతే ఉంటాయో వాటిని తొలగించి సమాప్తము చేసి సంపూర్ణ మమ్మాలా అయ్యి వెళ్ళాలి. సంపన్నతామూర్తిగా మమ్మా ఉదాహరణ రూపంలో ఎదురుగా ఉన్నారు. అలా ఇప్పుడు సెంటరు యొక్క అన్ని విషయాలకూ ఫుల్‌స్టాప్ పెట్టేయండి, ఇది నా శుభ భావన. బిందువును పెట్టి సంపన్నంగా మరియు కర్మాతీతంగా అయ్యేందుకు మౌన భట్టీ చెయ్యండి. సంపన్న స్థితి యొక్క వైబ్రేషన్‌లు లభించాలి మరియు దేహభానము నుండి దూరమైపోగలిగే మౌన భట్టీని చెయ్యండి. ఇప్పుడు మనము ఏదైతే చూసామో, మన నుండి ఈ అనుభవము కలగాలి – వీరైతే మమ్మా సమానంగా, బాబా సమానంగా సంపన్నంగా అయి వచ్చారు. కనుక ఇప్పుడు అన్ని విషయాలకూ బిందువు పెట్టేయండి. అంత శక్తి ఉండాలి. ఈ భట్టీ వైబ్రేషన్‌లు విశ్వములోకి వెళ్ళేటట్లుగా అంతగా కర్మాతీతము యొక్క భట్టీ చేసి వెళ్ళండి. రాజయోగుల నుండి తపస్వీలుగా అవ్వాలి, కర్మాతీతంగా అయ్యి ఇంటికి వెళ్ళాలి. ఇటువంటి సాక్షాత్కారమూర్తులుగా అవ్వాలి, మిమ్మల్ని ఎవరు చూసినా వీరు సాక్షాత్ మూర్తులుగా అయ్యి వచ్చారు అని అనుభవము చెయ్యాలి. మరి ఈ మౌన భట్టీ తప్పకుండా ప్రత్యక్షత యొక్క క్రొత్త పరదాను తెరుస్తుంది.